క్లుప్తంగా

మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

కావలి: సయ్యద్ రసూల్ సాహెబ్ విద్యా సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్స్, బీసీ–సీ, సిఖ్, బుద్దిస్ట్ ,జైన్, పార్సీ తదితర మైనార్టీ విద్యార్థులకు నీట్, గ్రూప్–2, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాల ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సయ్యద్ ఖాజారంతుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలోని మైనార్టీ సంక్షేమశాఖ సౌజన్యంతో పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో ఉన్న విజేత స్టడీ సర్కిల్‌లో ఇస్తున్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విదేశీ పర్యటనకు మున్సిపల్ కమిషనర్



కమిషనర్ రమేష్‌బాబును సత్కరిస్తున్న మెప్మా సిబ్బంది

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అమెరికా పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పలువురు మున్సిపల్, మెప్మా సిబ్బంది ఆయన్ను శాలువా కప్పి అభినందించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను ఆత్మకూరు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా నియమించినట్లు సమాచారం.

ట్యాక్సీ స్టాండ్‌కు స్థలం కేటాయించండి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వాహనదారులు

సోమశిల: అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో ట్యాక్సీ స్టాండ్ కోసం స్థలం కేటాయించాలని డ్రైవర్లు, యజమానులు సోమవారం అనంతసాగరం డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. పార్కింగ్ స్థలం లేక వాహనాలు నిలుపుకునేందుకు ఇబ్బందులు నెలకొన్నట్లు వారు వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం



హనుమత్ వాహనంపై సీతారాముల వైభవం

వరికుంటపాడు: వరికుంటపాడులోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల వారికి హనుమంతుడి వాహనంపై వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్త మామిళ్లపల్లి ప్రసాద్ ఇంటి నుంచి పూజాసామగ్రి, నైవేద్యాలు మేళతాళాలతో ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అల్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలియజేశారు. ఎంపీపీ శశిరేఖ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

పంచాయతీ సెక్రటరీపై టీడీపీ నేత దుర్భాషలు

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీ పిడుగు రవిపై ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పింఛన్ ఇంకా రాలేదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, పంచాయతీ సెక్రటరీ రవిని దుర్భాషలాడాడు. సదరు టీడీపీ నేతపై కార్యదర్శి రవి సీతారామపురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఉద్దేశ పూర్వకంగానే తనను దుర్భాషలాడుతూ సీఎంను నానా మాటలు అన్నాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం



సోమశిల: స్థానిక రామాలయంలో నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి కోదండ రాముడి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొని విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఉభయకర్తగా సద్దా భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

పంట విరామ వైద్యం

ఆక్వాలో నాణ్యమైన పంట తీయడానికి, రొయ్యల సాగులో ఏర్పడుతున్న వైరస్‌ల భూతాన్ని నివారించడానికి రైతులు ఏటా వేసవి ప్రారంభంలో రెండు నెలలు గుంతలను ఎండబెట్టేందుకు పంట విరామాన్ని పాటిస్తున్నారు. ఆక్వా రంగాన్ని వైరస్‌లు భారీగా దెబ్బతీస్తున్నాయి. వైరస్‌లను ఎదుర్కొనేందుకు రైతులు ప్రో బయోటిక్స్‌తో పాటు యాంటీబయోటిక్స్‌ను వాడుతున్నారు. అయినా వైరస్‌ల అవశేషాలు గుంతల అడుగు భాగంలో నిలిపోతుంటాయి. గుంతలను ఎండబెట్టడం ద్వారా వైరస్‌లను చాలా వరకు నియంత్రించుకునే అవకాశం ఉంది.

- నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల లక్ష్యం
- రెండు నెలల పాటు గుంతలు ఆరబెట్టుతున్న వైనం
- తద్వారా వైరస్‌ల నియంత్రణ



రొయ్యల గంతల్లోని నీటిని బకింగ్ హాం కెనాల్‌ల్లోకి వదిలేస్తున్న దృశ్యం

కావలి: ఆక్వా సాగు నిరంతరాయంగా చేయడం వల్ల రైతులకు లాభాలా కన్నా.. నష్టాలనే ఎక్కువగా మూటగట్టుకుంటున్నారు. కావలి మండలంలో పెద్ద పట్టపుపాళెం పంచాయతీ నందెమ్మపురం నుంచి అన్నగారిపాళెం వరకు సముద్ర తీరం వెంబడి మూడు పంచాయతీల్లో సుమారు 3,200 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. అయితే పెద్దపట్టపుపాళెం పంచాయతీ మినహా తుమ్మలపెంట, అన్నగారిపాళెం పంచాయతీల్లో సుమారు వెయ్యి మంది వరకు ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఉన్నారు. ఈ రెండు పంచాయతీల్లో దాదాపు 2,500 ఎకరాలకు పైగా ఆక్వా సాగవుతోంది. ఈ రైతులు ప్రతి ఏటా ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు ఆక్వా పంట విరామాన్ని పాటిస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే..

విదేశీ మారక ద్రవ్యంతో దేశానికి సిరులు కురిపించే రొయ్యలు సాగుచేస్తున్న రైతులు డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. తుమ్మలపెంట, అన్నగారిపాళెం పంచాయతీల్లో ప్రధానంగా బకింగ్‌హాం కెనాల్ ఆధారంగా ఆక్వా సాగు జరుగుతోంది. అయితే బకింగ్ కెనాల్‌కు సముద్ర ముఖం ద్వారా ఆటు పోటు సమయంలో వచ్చే సముద్ర నీటి ఆధారంగానే ఈ కెనాల్‌కు అటూ ఇటూ ఉండే భూముల్లో సాగు చేస్తున్నారు. సాగు నీరు అందించడానికి, డ్రైనేజీ నీరు బయటకు పోవడానికి బకింగ్‌హాం కెనాలే దిక్కుకావడంతో రైతులకు మొదటి నుంచి కూడా డ్రైనేజీ వ్యవస్థ శాపంగా మారింది. దీంతో ఆక్వా తరచూ వైరస్‌లు, బాక్టీరియాల బారిన పడడంతో రైతులు ప్రో బయోటిక్స్‌తో పాటు యాంటీబయోటిక్స్‌ను అధికంగా వాడుతున్నారు. నిర్దిష్టమైన ప్రమాణాలు అనుసరించకపోవడం వల్లనే ఆక్వా సాగు చేసే ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు వాతావరణం మార్పులు, పలు రకాల వైరస్‌లు సోకి రొయ్యల పెరుగుదల ఉండటం లేదు. మూడు నెలలకు మార్కెట్ తరలించాల్సిన రొయ్యలు నాలుగు, ఐదు, ఆరు నెలలు సమయం పడుతోంది. కొన్ని సందర్భాల్లో పంట కాలపరిమితికి ముందే పట్టుబడి చేయాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది. ఫలితంగా రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు.

వైరస్‌ల నియంత్రణకే..

ఆక్వా సాగుకు విరామం లేకుండా నిరంతరాయంగా చేయడం వల్ల వైరస్‌ల అవశేషాలు గుంతల అడుగు భాగాల్లో నిలిచిపోతోంది. తదుపరి పంట వేసినప్పుడు మళ్లీ వైరస్‌లు విజృంభిస్తున్నాయి. దీనికి విరుగుడు పంట విరామమని ఆక్వా టెక్నీషియన్లు సూచించడంతో ఈ రెండు పంచాయతీల్లో ఏటా రెండు నెలల పాటు క్రాప్ హాలిడే పాటిస్తున్నారు. ఈ రెండు నెలల పాటు గుంతలను బాగా దుక్కి చేసి ఆరబెట్టడం ద్వారా వైరస్‌లు నశించిపోతాయి. రొయ్యల గుంతల్లో , గుంట చుట్టూ ఉన్న దుర్గంధభరితమైన డ్రైనేజ్ అంతా కూడా ఎండిపోతోంది. మురుగు నీరు, మురుగు నిల్వ ఉన్న నేలలో నుంచి ఉత్పన్నమయ్యే పలు రకాల సమస్యలు పరిష్కారానికి దోహదపడుతోందని ఆక్వా రైతులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 1 నుంచి మళ్లీ రొయ్యల సాగును ప్రారంభిస్తే పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



రొయ్యల గంతల్లో అడుగు భాగంలో చేరిన పాచి

క్రాప్ హాలిడేతో మేలు



వైరస్‌ల ధాటిని తట్టుకొని రొయ్యలు బతికి బట్ట కట్టాలంటే రొయ్యల గుంతల చుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. అందుకే ప్రతి ఏటా ఎండా కాలంలోలో రెండు నెలలు పాటు రొయ్యలు సాగు చేయడాన్ని నిలుపుదల చేస్తున్నాం. దాని వల్ల గుంతలు చుట్టూ ఉన్న మురుగు కాలువల్లోని నీరు ఎండిపోతుంది. రొయ్యలను ఆశించే వైరస్‌లను నివారించడానికి వాడిన కెమికల్స్ ప్రభావం కూడా సంపూర్ణంగా నశించిపోతోంది. గుంతలు చుట్టూ మురుగు వదలించుకోవడానికి క్రాప్ హాలిడే పాటిస్తున్నాం.

– కొమారి రాజు, ఆక్వా రైతులు, తుమ్మలపెంట, కావలి మండలం

ఆదమరిస్తే ప్రమాదం



ఆత్మకూరు ఆర్టీసీ డిపో ప్రవేశ మార్గంలో ఏర్పడిన భారీ గుంత

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద బస్‌స్టేషన్‌కు రాకపోకలు సాగించే మార్గంలో ప్రమాదం క్లోదుటే పొంచి ఉంది. ఆత్మకూరు–నెల్లూరుపాళెం రోడ్డు నుంచి వెళ్లే వైపు మురుగు కాలువపై 30 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని దశల వారీగా కూలిపోతోంది. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గతేడాది ఆగస్టులో ఈ కల్వర్టు కూలిపోయి ప్రమాదభరితంగా ఉండడంతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అప్పట్లో ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు ఫయాజ్ అహమ్మద్, సుభాషణం కల్వర్టును పరిశీలించి నెల రోజుల్లో నూతన కల్వర్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆరు నెలలవుతున్నా ఇంత వరకు కల్వర్టు పునర్దరణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రాత్రి వేళలో ప్రయాణాలు సాగించే వారు డిపో వద్దకు తమ వాహనాల్లో వచ్చే సమయంలో ఈ గుంతలో పడి గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కల్వర్టు ప్రాణాంతకంగా మారింది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే దెబ్బతిన్న కల్వర్టు భాగాన్ని తొలగించి నూతన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది, వాహనదారులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొండమ్మ

కావలి రూరల్: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంపీపీ కొండమ్మ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్న ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసుకునేలా అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. వేసవి కాలంలో ఎక్కడా కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఏ సమస్య వచ్చిన వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతి నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అండగా ఉండాలని, చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పంచాయతీల్లో జరుగుతున్న పలు అభివృద్ధిపై సమీక్షించారు. జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

సీతారామపురం: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. ఆయన సోమవారం మండలంలోని మారంరెడ్డిపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. పని వేళల్లో సిబ్బంది సచివాయలంలో అందుబాటులో ఉండాలని, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఎస్‌డీజీ సర్వే నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహాల పరిసరాలను శుభ్ర పరచాలి

చేజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల పరిసరాలను శుభ్ర పరచాలని అంబేడ్కర్స్ ఇండియా మిషన్ నాయకులు కోరారు. సోమవారం ఎంపీడీఓ విజయలలితకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని యర్రబల్లి, తిమ్మాయపాళెం, వావిలేరు, చేజర్ల బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. అంబేడ్కర్ జయంతి నాటికి విగ్రహాలకు రంగులు వేయించాలన్నారు.

వేణుగోపాలుడికి శేషపాన్పు సేవ



విశేష పుష్పాలంకరణలో మూలమూర్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో కొలువైన అతి పురాతన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శేషపాన్పు సేవ కనులపండువగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామి వారికి విశేష పుష్పాలంకరణతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంలో స్వామివారికి మహిళలు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆరు, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట కస్తూర్బాగాంధీ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి సోమవారం తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపులో ఆన్‌లైన్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆరో తరగతి ప్రవేశానికి సైతం అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు 5వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, మూడు ఫొటోలు ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ పాఠశాల కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు http://apkgbv. apcfss.in లో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

వైభవంగా పొన్నమాను సేవ

వింజమూరు (ఉదయగిరి): శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చెన్నకేశవస్వామికి పొన్నమానుసేవ నిర్వహించారు. కొత్తూరు నుంచి బాణసంచా కాలుస్తూ మంగళవాయిద్యాల నడుమ ఉభయాన్ని దేవస్థానానికి చేర్చారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పొన్నమానుపై ఉంచి కృష్ణావతారంలో చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

గజవాహనంపై శ్రీరామచంద్రుడు

మండలంలోని గుండెమడకల సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం గజవాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని గజవాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం, రథోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఉదయగిరి: మండలంలో రైతులు పండించిన పసుపు పంట అమ్ముకునేందుకు ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో పలువురు పసుపు రైతులు సోమవారం బండగానిపల్లి సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. కొండకింద గ్రామాల్లో విస్తారంగా రైతులు పసుపు పంటను సాగు చేశారన్నారు. పసుపు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రం అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. అనంతరం వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య, ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల చలో ఢిల్లీ

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో సీపీఎం, సీపీఐ తదితర ప్రతిపక్ష పార్టీలు చేయనున్న మహాధర్నాకు ఆత్మకూరు సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్ రాజు, అహమ్మద్ బాషా, ఎల్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



క్వారీ వద్దంటూ ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ మీరమ్మ

సంగం: సంగం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పద్మావతమ్మ మాట్లాడారు. అధికారులందరూ సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. తరుణవాయి సర్పంచ్ బాలానాయుడు మాట్లాడుతూ తాను దరఖాస్తు చేసిన పొజిషన్ సర్టిఫికెట్లను రెవెన్యూ కార్యాలయంలో తిరస్కరించారని ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న స్పందిస్తూ వీఆర్‌ఓ తప్పిదం వల్ల తిరస్కారం చేయాల్సి వచ్చిందని తెలిపారు. వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలకు నాణ్యత కలిగిన బియ్యం అందేలా చూడాలన్నారు. కొరిమెర్ల సర్పంచ్ మీరమ్మ సంగం కొండపై అటవీశాఖ భూముల్లో ఏర్పాటు చేయబోతున్న క్వారీ వల్ల ప్రమాదం పొంచి ఉందని, అనుమతులు రాకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం విద్య, వైద్యం, వ్యవసాయానికి సంబంధించిన అధికారులు మాట్లాడారు. హౌసింగ్ ఏఈ కరీముల్లా మాట్లాడుతూ జగనన్న కాలనీల నిర్మాణానికి జియో ట్యాగింగ్‌తో పాటు సంగంలో బ్యాంకు అకౌంట్ సైతం ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే జగనన్న కాలనీల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి గృహనిర్మాణ పనులు వేగవంతానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీడీఓ గోపి, ఎస్సై నాగార్జునరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ప్రజల వినతులను చిత్తశుద్ధితో పరిశీలించి పరిష్కరించాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మురగళ్ల సచివాలయంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమల్లో రాజీలేకుండా లబ్ధిదారులకు పథకాలు అందజేస్తుందని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మురగళ్ల సచివాలయం పరిధిలో 119 సమస్యలు సర్వే ద్వారా గుర్తించగా 61 సమస్యలు ఇప్పటికే పరిష్కరించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పువ్వాడి హరిత, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, వీఆర్‌ఓ ఖాజారంతుల్లా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై కొర్రీలు తగవు



మాట్లాడుతున్న సర్పంచ్

కొండాపురం: మండలంలోని గానుగపెంట గ్రామానికి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో ఎంపీడీఓ ఎం.బ్రహ్మయ్య కొర్రీలు వేయడం తగదని ఆ గ్రామ సర్పంచ్ మంచాల మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా గానుగపెంట గ్రామానికి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లేక కూలీలకు ఉపాధి కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీ తీర్మానం చేసి అభ్యర్థిని ప్రతిపాదించమని సూచించారన్నారు. ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేసి పంపించినా పీడీ అనుమతి లేకుండా ప్రతిపాదించడం వీలుపడదని ఎంపీడీఓ చెబుతున్నారన్నారు. ఏపీఓ చెంచయ్య, ఎంపీడీఓ, స్థానిక కొందరు నాయకుల సలహాలతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. పదో తరగతి చదివి, ఎస్సీ రిజర్వేషన్‌తో పాటు దివ్యాంగుడైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తికి ఉద్యోగం కల్పించడంలో కొర్రీలు వేయడం తగదన్నారు. ఎంపీడీఓ వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఎం.బ్రహ్మయ్యను వివరణ కోరగా ఎఫ్‌ఏ నియామకం విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం జరుగుతోందని, సర్పంచ్ తీర్మానం సరిపోదని సమాధానం చెప్పారు. పీడీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీఓ లావణ్య



చిన్నారుల తల్లులకు పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీఓ పద్మజకుమారి

కలిగిరి: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజకుమారి తెలిపారు. కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అందించే పోషకాహారాలను వివరించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, మాధవి, మహిళా పోలీస్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ పచ్చల లావణ్య, మండల వైద్యాధికారిణి శివకల్పన అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో పౌష్టికాహార వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలింతలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా చూసుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీటీసీ పెదమస్తాని, ఆరోగ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అక్బర్ బాషా, షాను, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా పది పరీక్షలు ప్రారంభం



మర్రిపాడు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

మర్రిపాడు: మర్రిపాడులోని రెండు కేంద్రాల్లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పరీక్ష కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది.

ఆత్మకూరు: పటిష్టమైన బందోబస్తు మధ్య ఆత్మకూరు పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని ఆత్మకూరు ఎంఈఓ షేక్ నజీర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతుందని తెలిపారు.

సంగం: గురుకుల పాఠశాల, సంగం ఉన్నత పాఠశాలల్లో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండు కేంద్రాల్లో 420 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 417 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినర్లు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌లు తెలిపారు.

సోమశిల: మండలంలోని సోమశిల ఉన్నత పాఠశాలలో 81 మంది, రేవూరులో 165, అనంతసాగరం సెంటర్‌లో 218 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు పరిచి పర్యవేక్షణ చేస్తున్నారు.

చేజర్ల: పదో తరగతి పరీక్షలకు చేజర్ల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 182 మందికి 181 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 212 మందికి 210 మంది విద్యార్థులు హాజరయ్యారని నెల్లూరు డిప్యూటీ డీఈఓ భిక్షాలు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై మరిడినాయుడు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమసముద్రంపేట: ఏపీ మోడల్‌పాఠశాల, జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏపీ మోడల్ పాఠశాలలో 150 మందికి ముగ్గురు, జెడ్పీ హైస్కూల్‌లో 130 మందికి ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు.

పది పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ప్రభుత్వ ఉన్నత, సెయింట్‌మేరీస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన పది పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. తెలుగు పరీక్షకు 563 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు కావడంతో 561 మంది పరీక్షలు రాశారన్నారు.

కొండాపురం: మండలంలో ఆదర్శ, జెడ్పీ పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదర్శ పాఠశాలలో 174 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 173 మంది, స్థానిక జెడ్పీ పాఠశాలలో 155 మంది విద్యార్థులకు 153 మంది హాజరైనట్లు ఎంఈఓ కె. రవికుమార్ తెలిపారు.

వరికుంటపాడు: జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అరగంట ముందుగా చేరుకుని నంబర్లు, గదులు చూసుకోవడంలో కోలాహలంగా కనిపించింది. తిమ్మారెడ్డిపల్లి పాఠశాల విద్యార్థిని రేష్మాను ఆమె తల్లి వీల్‌చైర్‌లో తీసుకొచ్చి వదిలివెళ్లారు.

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో సోమవా రం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. జలదంకిలో ఏ పరీక్ష కేంద్రంలో 172 మంది విద్యార్థులకు నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ పి.మాధవరావు తెలిపారు. బీ పరీక్ష కేంద్రంలో 182 మంది విద్యార్థులకు 174 మంది హాజ రైనట్లు పరీక్షల చీఫ్ సీహెచ్ జయభారతి తెలిపారు.

కలిగిరి: ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏపీ మోడల్ స్కూల్‌లో 172 మంది విద్యార్థులకు 169 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 158 మందికి 155 మంది విద్యార్థులు హాజరయ్యారు.